# అంగన్‌వాడీలూ అంతే..

**◆సమావేశాల పేరిట సెంటర్లకు తాళం ◆అంగన్‌వాడి సేవలకు తరచు అంతరాయం ◆అధికారులు పర్యవేక్షించాలని స్థానికుల డిమాండ్**

**పెద్దేముల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** అంగన్‌వాడి కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యం, పోషణ ప్రీ స్కూల్ విద్యకు కీలక కేంద్రాలుగా ఉండాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో టీచర్లు తరచు సమావేశాల పేరిట కేంద్రాలకు తాళాలు వేసి వెళ్ళిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు పొందాల్సిన సేవలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో సమావేశం ఉండగా, నాగులపల్లి-2, పాషపూర్, అడ్కిచెర్ల అంగన్‌వాడి కేంద్రాలకు మధ్యాహ్నం నుంచే తాళాలు వేసి ఉంచారు. దీంతో ఆంగన్‌వాడి కేంద్రాలకు వచ్చిన బాలింతలు, గర్భిణిలు, చిన్నారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు. సమావేశాలు అవసరమే అయినప్పటికి వాటి నిర్వహణ వల్ల కేంద్రాల సాధారణ సేవలు పూర్తిగా నిలిచిపోవడం సమంజసమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబం ధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కొందరు అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు ఎప్పుడు పడితే అప్పుడు కేంద్రాలకు తాళాలు వేసి వెళ్ళిపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్‌వాడి కేంద్రాల పనితీరుపై ఉన్నతాధికారులు పర్యవేక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తీసుకుంటాం.



మూసి ఉన్న అడ్కిచెర్ల అంగన్‌వాడి సెంటర్

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : సూపర్‌వైజర్ మీనాక్షి** : అడ్కిచెర్ల, పాషపూర్, నాగులపల్లి-2 అంగన్‌వాడి కేంద్రాలకు మధ్యాహ్నం నుంచే తాళాలు వేసి ఉంచారు. భాధ్యులపై చర్యలు తీసుకుంటాం.





రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న డిపిఆర్వో

## సోదరభావంతో జీవించాలి : కలెక్టర్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీకి జిల్లా మహిళా అధికారులు రక్షాబంధన్ కట్టారు. గురువారం కలెక్టరేట్‌లో డీపీఆర్వో చెన్నమ్మ, డీపీవో జయసుధ, జిల్లా వ్యవసాయ అధికారి కవిత రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అన్నారు. ప్రజలంతా సోదరభావంతో, జీవించాలని కలెక్టర్ సూచించారు.

# బడితెగింపు





గురువారం తాళం వేసి ఉన్న బండమీదిపల్లి, అడ్కిచెర్ల పాఠశాలలు





*పెద్దేముల్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉన్నా, కొందరు ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం, అధికారుల పర్యవేక్షణ కొరవవడం వల్ల విద్యావ్యవస్థ దారి తప్పుతోంది. చిన్నారుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ బరితెగించిన తెగిస్తున్న సిబ్బందిపై కలెక్టర్ దృష్టి సారించాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.*

**★హెచ్‌ఎం వీడ్కోలు విందు కోసం 10 ఊళ్ల బడులు మూసివేత**
**★దిక్కుతోచక గుడి ఆవరణలో చదువుకున్న విద్యార్థులు**
**★కొన్ని గ్రామాలలో రోడ్లపై ఆడుకుంటూ చిన్నారుల కాలక్షేపం**
**★చదువులు చట్టుబండలవుతున్నాయని తల్లిదండ్రుల ఆవేదన**
**★విద్యావ్యవస్థ ప్రక్షాళనకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**పెద్దేముల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** కోట్లాది రూపాయలు కుమ్మరించి సర్కారు బడులను బాగుచేద్దామని ప్రభుత్వం తాపత్రయపడుతుంటే, కొందరు ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, అధికారుల నిద్రమత్తు ఆ ఆశయాన్నే నిలువునా నీరుగారుస్తున్నాయి. పెద్దేముల్ మండలంలో పాఠశాలలు విద్యానిలయాల్లా కాకుండా ఉపాధ్యాయుల సొంత అడ్డాల్లా మారిపోయాయి. దుర్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో కొంతమంది బరితెగింపు పరాకాష్టకు చేరింది. ఉదయం 11 గంటలకే డ్యూటీకి దుమ్మా కొట్టి తప్పు కప్పిపుచ్చుకోవడానికి వాట్సాప్‌లో ఆన్‌లైన్ లీవ్ పెట్టానంటూ నాటకాలాడిన ఓ హెచ్ ఉదంతం విద్యావ్యవస్థను అప్రదిష్టపాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన మరవకముందే ..గురువారం ఒక హెచ్‌ఎం రిటైర్మెంట్ సత్కారం పేరుతో బండమీదిపల్లి, పాషపూర్, రాంసింగ్‌తాండా, అడ్కిచెర్ల, జైరాంతాండా, ఓంలానాయక్‌తాండా, రచ్చకట్టతాండా, బాయిమీదితాండా, సిద్దన్నమదుగుతాండా గ్రామాలతో పాటు తట్టిపల్లి పాఠశాలలకు మధ్యాహ్నం నుంచే తాళాలు వేసి ఉపాధ్యాయులంతా జంబో విందులకు దండయాత్ర చేశారు. ఈ వ్యవహారంపై నివ్వెరపోయిన తల్లిదద్రుల సమాచారం మేరకు మీడియా ప్రతినిధులు ఆయా గ్రామాలలోని పాఠశాలల వద్ద పరిశీలించగా.. కొన్ని చోట్ల విద్యార్థులు ఆడుకుంటూ.. కొన్ని చోట్ల విద్యార్థులు దేవాలయ ఆవరణలో చదువుకుంటు కనిపించారు. బాధ్యతాయుతమైన బోధన పక్కనపెట్టి, పాఠశాలల వేళల్లో సత్కారాలు, సంబరాలు జరుపుకోవడమే ముఖ్యమా? అంటూ తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. అసలు మండల విద్యాధికారి అనుమతి లేకుండా బడులకు తాళాలు వేసి వెళ్లే ధైర్యం వారికి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. పిల్లల భవిష్యత్తును బలితీసుకుంటున్న ఇలాంటి నిర్లక్ష్యపు సిబ్బందిపైనా.. ఏమీ పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్న అధికారులపైన తక్షణమే సస్పెన్షన్ వేటు వేయాలి డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై మండల విద్యాధికారి నర్సింగ్‌రావును వివరణ కోరగా.. అధికారికంగా సెలవు ఇవ్వలేదని, వారు ఎందుకు పాఠశాలలను మూసి వెళ్ళారో తెలియదని సమాధానం చెప్పారు. మండలంలో గాడితప్పిన విద్యావ్యస్థ ప్రక్షాళనకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలని మండల ప్రజానీకం డిమాండ్ చేస్తోంది.



పాషపూర్‌లో బడికి తాళంపడటంతో గుడి ఆవరణలో చదువుకుంటున్న చిన్నారులు

## 'ఎగనామం'పై అధికారుల సీరియస్
### వార్తకు స్పందన

ఉపాధ్యాయులు విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాదికారి నర్సింగ్‌రావు హెచ్చరించారు. గురువారం వార్త దినపత్రికలో వచ్చిన విధులకు ఎగనామం దుగ్గాపూర్ బడిలో హెచ్‌ఎం ఇష్టారాజ్యం అనే కథనానికి స్పందించిన యంఈఓ నర్సింగ్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శివకుమార్‌తో కలిసి దుగ్గాపూర్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుని వివరణ తీసుకోవడంతోపాటు గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించారు. ఈ నివేదకను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. పాఠశాలలలో ఉదయం 9 నుంచి మద్యాహ్నం 4 గంటల వరకు విద్యార్థులకు భోధన అంశాలను, సామార్థ్యాలను అందించే విధంగా చూడాలని ఆదేశించారు. డిఎస్‌సి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌లు కూడా వేసి విధులు ఎగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుగ్గాపూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఇవో

# జయరాజ్‌కు వికారాబాద్‌తోనూ అవినీతి లింకులు?

**భూపాలపల్లి మైన్స్ ఏడి ఆస్తులపై ఎసిబి ఆరా**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** భూపాలపల్లి జయశంకర్ జిల్లా గనులు, భూగర్భవనరులశాఖ సహాయ సంచా లకులు బీ.జయరాజ్ నివాసంలో ఎసిబి సోదాలు జరుగుతున్న సమయంలో వికారాబాద్ జిల్లాలో కూడా ఆయనకున్న పాత సంబంధాలపై ఆరా తీశారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఫిర్యాదులపై 12 చోట్ల సోదాలు జరిపిన ఏసీబీ బృందం గురువారం తాండూరుకు వచ్చింది. పలుచోట్ల పర్యవేక్షించి ఓ నాపరాయి వ్యాపా రి ఇంటి వద్ద సుమారు రెండు గంటల పాటు పలు ఫైళ్లను పరిశీలించినట్లు తెలిసిం ది. 2009 నుంచి 2014 వరకు తాండూరు మైన్స్ ఏడీగా జయరాజ్ పని చేశారు. సుద్ధ, నాపరాయి వ్యాపారులతో మంచి సంబం ధాలు ఉన్న ఆయన కొంతమంది బడా వ్యాపారులతో కలిసి ఖనిజాల వ్యాపారం జరుపుతున్నట్లు అనుమానంతో ఏసీబీ అధికారులు ఆరా తీశారు. రైల్వేస్టేషన్ మార్గంలోని ఓ వ్యాపారి నివాసానికి ఎరుపు రంగు కారులో వచ్చిన ఏసీబీ అధికారులు, సిబ్బంది చాలాసేపు ఉన్నారు. కానీ మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. జయరాజ్ బదిలీపై వెళ్లిపోయిన చాలా రోజుల తర్వాత ఏసీబీ సోదాలు చేయడం కలకలం రేగింది. కొంతకాలం క్రితం తాండూరు ఏడీగా జయరాజ్ మళ్లీ వస్తారని ప్రచారం జరిగింది. త్వరలో ఆయన పదోన్నతి, పదవి విరమణకు చేరువగా ఉన్న తరుణంలో ఏసీబీ సోదాలు జరుగడం గమనార్హం. తాండూరు పరిసరాలలో నాపరాయి గనులు, వందలాది ఎకరాలలో సుద్ధ నిక్షేపాలు ఉన్న విషయం తెలిసిందే. గురువారం ఏసీబీ రైడ్స్ జరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు, తాండూరు మైన్స్ కార్యాలయం అధికారులు, సిబ్బంది కలవరానికి గురైనారు. అయితే, యథావిధిగా విధుల్లో ఉన్నారు.



తాండూరు వచ్చిన ఎసిబి అధికారులు(ఇన్‌సెట్) మైనింగ్ ఎడి జయరాజ్



మిఠాయిల తయారీకి వినియోగిస్తున్న కాలం చెల్లిన పదార్థాలు, సింథటిక్ రంగుల బాటిళ్లు

## మిఠాయిల తయారీలో కెమికల్స్
### ప్రజారోగ్యానికి పెను ముప్పు..

**తీవ్ర హాని కలిగించే సింథటిక్ రసాయన కలర్లు**
**కాలం చెల్లిన ముడి పదార్థాలను గుర్తించిన పోలీసులు**
**సింథటిక్ కెమికల్స్ స్వాధీనం, యజమాని అరెస్ట్**

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదరిగూడ వెంకటాద్రీ టౌన్‌షిప్‌లో దారుణం వెలుగులోకి వచ్చింది. స్థానిక బాలాజీ పవన్ స్వీట్ హౌస్‌లో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే సింథటిక్ రసాయన కలర్స్, కాలం చెల్లిన ముడి పదార్థాలతో మిఠాయిలు తయారు చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఉప్పల్ ఎస్ఓటీ పోలీసులు గురు వారం ఆకస్మిక దాడులు జరిపారు. తనిఖీల్లో ఆహార భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించి, భారీగా రసాయనాలు కలుపు తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ అక్రమాలకు కారణమైన స్వీట్ షాప్ యజమాని, రాజస్థాన్‌కు చెందిన కమల్‌ను ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని పోచారం ఐటీ కారిడార్ పోలీ సులకు అప్పగించారు. ఘటనా స్థలం నుండి పలు సింథటిక్ కలర్స్ బాటిల్స్‌తో పాటు తయారైన కొన్ని మిఠాయిలను పోలీ సులు స్వాధీనం చేసుకుని, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిం చారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలతో పాటు నింది తుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు. కల్తీ పదార్థాలతో స్వీట్లు తయారు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

## ఫారమ్ పాండ్‌తో భూగర్భ జలాల పెంపు

**మర్పల్లి, అగస్టు 27 ప్రభాతవార్త :** ఫారమ్ పాండ్‌తో నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, సాగు నీటి ప్రయోజనాలు ఎలాంటివో రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. మర్పల్లి మండలంలోని దామస్తాపూర్ గ్రామంలో చేపట్టిన ఫారమ్ పాండ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు అను కూలంగా ఉన్నందున విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ కూలీల హాజరు, పనిదినాలు, వేతనాల వివ రాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో వారికి అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు.





## సర్ ఎలా ఉంది?
### అభ్యంతరాలుంటే చెప్పండి కలెక్టర్ మనుచౌదరి

**శామీర్‌పేట, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో తమ వివరాలను పరిశీలించి ఏమైనా తప్పులు ఉన్నా, అభ్యంతరాలు ఉన్నట్లైతే గ్రామసభల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకరావాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి గ్రామ ప్రజలకు సూచించారు. గురువారం శామీర్‌పేట గ్రామంలో ఎస్ఐఆర్‌పై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఓటర్లకు సంబంధించి గ్రామసభను పూర్తి పారద ర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఓటరు సవరణపై ఎలాంటి సందేహాలు, ఉన్నా గ్రామసభలలో నివృత్తి చేసుకోవాలన్నారు. 2002లో ఓటరు జాబితాలో ఉన్న వివరాలు, ప్రస్తుతం ఉన్న జాబితాలో వివరాలు సరిచూడటం జరిగిందన్నారు. మీరు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలలో 2002నాటి వివరాలు లేకపోయినట్లు అయినా చిన్న చిన్న సవరణలు, ఉన్నట్లైతే వారి డాక్యుమెంట్స్ వెరిపై చేసుకుని సవరణ చేయటం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు బిఎల్ఓలు వచ్చి నోటీసు ఇస్తారని, ఓటరుకు సంబం ధించిన డాక్యుమెంట్స్ ఇవ్వగలిగితే మీ పేరు ఫైనల్ జాబితాలో ఉంటుందని, ప్రతి ఒక ఓటరు బిఎల్ఓలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

# ఔటర్ రింగ్ రోడ్డు ప్రక్రియలో కీలక అడుగు

**తాండూరు బైపాస్ నిర్మాణానికి లైన్ క్లియర్**
**ఎకరాకు రూ.20లక్షలు, గజానికి రూ.6వేలు చొప్పున పరిహారం**

**యాలాల ఆగస్టు 26, ప్రభాతవార్త :** స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక కృషితో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తాండూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. భూ నిర్వాసితుల పరిహారం చెల్లింపుల్లో ఏర్పడిన తాత్సారం కారణంగా ఇన్నాళ్లు నిలిచిపోయిన ఈ ఔటర్ రింగ్ రోడ్డు ప్రక్రియలో గురువారం కీలక అడుగు పడింది. జాయింట్ కలెక్టర్ వెంకటాచారి సమక్షంలో యాలాల మండలంలోని రసూల్‌పుర హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కోకట్, రసూల్‌పుర, అంతారం, చెంగోల్ గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులతో పారదర్శకంగా గ్రామ సభ నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. 2016లోనే ప్రభుత్వం 108 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసి, 73 ఎకరాలకు పరిహారం చెల్లించిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. మిగిలిన 25.06 ఎకరాల భూ సేకరణకు సంబంధించి ఈ నెల 21న నోటిఫికేషన్ ఇచ్చి, రైతుల సమ్మతితో ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. తాండూరు మండల రైతులకు ఎకరాకు రూ. 20 లక్షలు, కోకట్ రైతులకు రూ. 21 లక్షలతో పాటు ఇంటి ప్లాట్లకు గజానికి రూ. 6 వేలు భూ పరిహారంగా ఇస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పరిహారం సొమ్మును వారం రోజుల్లోనే నేరుగా బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇచ్చారు. కబ్జాలు, పట్టాల సమస్యలు మరియు ప్లాట్లు కోల్పోతున్న లబ్ధిదారులకు ఎలాంటి నష్టం జరగకుండా న్యాయం చేస్తామని, మరణించిన రైతుల వారసులకు కూడా తగిన పరిహారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ నీరజాబాల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతోనే ప్రాజెక్టు ముందుకు సాగుతోందని, రైతులు సహకరించి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఎలాంటి వ్యతిరేకత లేకుండా గ్రామ సభ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటాచారి

# మాతో పెట్టుకుంటే మనుగడ ఉండదు..

**మహాధర్నాలో ప్రభుత్వానికి ఉద్యోగుల వార్నింగ్**
**మేనిఫెస్టో హామీలు అమలు చేయాలని డిమాండ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల మహాధర్నా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మెనిఫెస్టోలో పిఆర్‌సి, ఉద్యోగుల,ఉపాధ్యాయుల డిఏ బకాయిలు చెల్లిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచిందని, కాలయాపనతో మోసం చేస్తోందని పలువురు నాయకులు ధ్వజమెత్తారు. ప్రభుత్వం నుంచి ఇక హామీలు వద్దని, పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో, ఉపాధ్యాయులతో, పెన్షనర్లతో పెట్టుకుంటే ప్రభుత్వానికి మనుగడ ఉండదని వారు హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకుంటే మాత్రం సెప్టెంబరు 10వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు టిజిఈజెఎసి నాయకులు స్పష్టం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద టిజిఈజెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా టిజిఈజెఎసి కమిటీ చైర్మన్ బి.రవిప్రకాశ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహాధర్నా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ర్యాలీగ విచ్చేసి కలెక్టరేట్ ప్రాంగణ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత మహాధర్నా సందర్భంగా జరిగిన సభలో టిజిఈజెఎసి మేడ్చల్ జిల్లా కమిటీ చైర్మన్ బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల,పెన్షనర్ల చిరకాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు కొత్తవి కావని, ఎన్నో సంవత్సరాలుగ ప్రభుత్వ దృష్టికి తీసువెళ్తున్నట్లు, ఇక నిరీక్షించే పరిస్థితి లేదని ఉద్యోగులు ఆందోళనకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాలు రాష్ట్ర వ్యాప్తంగ జరుగుతున్నట్లు, ప్రభుత్వం స్పందించకుంటే మాత్రం సెప్టెంబరు 10వేతదీన జరిగే ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టిజిఈజెఎసి అదనపు సెక్రటరీ జనరల్ సదానందంగౌడ్ పిలుపునిచ్చారు. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరిని జిల్లా టిజిఈజెఎసి నాయకుల బృందం వెళ్లి వినతిపత్రాన్ని అందజేసి సిఎం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిజిఈజెఎసి నాయకులు వినోద్, రాజ గంగారెడ్డి,రామేశ్వర్‌గౌడ్, బి.వెంకటేశ్వర్లు, ఆనంద్‌రెడ్డి, విఠల్, మదన్‌రెడ్డి, రాజు,శ్రీధర్, జయసింహారెడ్డి, భరత్‌కుమార్, రాంరెడ్డి, కార్తీక్, గిరికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా టిజిఈజెఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్



పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్

## చేయూత పింఛన్ల పోస్టర్ ఆవిష్కరణ

**శామీర్‌పేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత ఫించన్ల పథకం పోస్టర్‌ను మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆవిష్కరించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద చేయూత ఫించన్ల ధరఖాస్తుల స్వీకరణకు సంబంధించి పోస్టర్‌ను ఆయన కమిషనర్ వెంకటగోపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ చేయూత ఫించన్ల కోసం ధరఖాస్తులు ఈ నెల 31వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో స్వీకరించటం జరుగుతుందని అన్నారు. ధరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలోనే సమర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలరు కొల్లాస్ రాజు, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, స్థానిక నాయకులు వైద్యనాథ్, శివప్రసాద్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, భస్వారెడ్డి, యాదగిరి, మున్సిపల్ సిబ్బంది, అధికారులు నరేశ్, మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ గులాం ఇద్రీస్

## సెప్టెంబరు 16లోపు సవరణలు చేసుకోండి

**శామీర్‌పేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఓటరు జాబితాకు ఎస్ఐఆర్‌కు సంబంధించి ఏమైన సవరణలు, చేర్పులు, మార్పులు ఉంటే సెప్టెంబరు 16వ తేదీలోపు చేసుకోవచ్చని మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ గులాం ఇద్రీస్ సూచించారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్‌లో ఎస్ఐఆర్‌పై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ గులాం ఇద్రీస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత గడువులోగా ధరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ గులాం ఇద్రీస్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాము రవి, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, స్థానిక కౌన్సిలర్లు చిన్నలచ్చ సరిత, గొంది శ్రీవాణి, కొల్లాస్ రాజు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, నాయకులు బండి జగన్నాథం, వైద్యనాథ్, శివప్రసాద్, వెంకట్‌రెడ్డి, భస్వారెడ్డి, రాజారామ్, బిఎల్ఓ వీరమణి తదితరులు పాల్గొన్నారు.

## జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించాలి


జీవన్ ధార ఫార్మసీని సందర్శించిన మెప్మా పీడీ వెంకటనారాయణ

**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న జీవన్‌ధార ఫార్మసీని రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ జి. వెంకట నారాయణ గురువారం సందర్శించారు. విజిటింగ్‌లో భాగంగా ఫార్మసీలో అందుబాటులో ఉన్న జనరిక్ మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో జనరిక్ మందులు అందిస్తున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన కల్పించి, వాటిపై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. జనరిక్ మందులు నాణ్యమైనవే కాకుండా తక్కువ ధరలకు లభిస్తాయని ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్, కార్డియాలజీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు రెగ్యులర్‌గా మందులు వాడే రోగులకు జనరిక్ మందులు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటం ప్రయోజనకరమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవన్ లారా ఇన్చార్జ్ జ్ఞాన ప్రసూన, శైలజ, మెప్మా ఇన్‌చార్జి డీఎంసీ అశోక్, షాద్‌నగర్ మెప్మా డీఈఓ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తా


చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఫరూక్‌నగర్ మండలం విట్యాల గ్రామంలోని 1వ వార్డులో వార్డు మెంబర్, ఫరూక్‌నగర్ మండల వార్డు మెంబర్ల ఫోరం ప్రధాన కార్యదర్శి కే. రాజు ప్రజా సంక్షేమానికి తనవంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం 1వ వార్డులోని ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వార్డు మెంబర్ కే. రాజును అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను మరింతగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయశ్రీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎం.డి. వాహబ్, కావాలి రాజు, ఉప సర్పంచ్ రమేష్, వీఓఏ మొయినుద్దీన్, వార్డు మెంబర్లు చిట్టెమ్మ, యాదమ్మ, సునీత, విజేందర్, లక్ష్మీ ్మ, యాదయ్య, రాఘవేందర్ గౌడ్, రవీందర్ గౌడ్, ఇసాక్, డాక్టర్ యాదయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మమ్మ, ఆశా వర్కర్ పద్మతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త జంటకు సిఎం రేవంత్ రెడ్డి ఆశీర్వాదం


వివాహ వేడుకల్లో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి



**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** శంషాబాద్ మల్లికా గార్డెన్‌లో జరిగిన షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్-అనురాధ దంపతుల మేనకోడలు రాణి-శివకుమార్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షి ంచారు. కుటుంబంలో వివాహ వేడుక జరుగుతున్న సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు సీఎం స్వయంగా వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిమానులు పెద్ద సంఖ్యలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు ఉత్సాహం చూపారు. సీఎం రేవంత్ రెడ్డి వారందరినీ ఆప్యాయంగా పలకరించి, కరచాలనం చేశారు. నూతన వధూవరులు రాణి-శివకుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శుభాకాంక్షలు తెలియజేసి, వారితో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ నేత కాశీనాథ్ రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించి ..న్యాయం చేయండి

**-ప్రభుత్వానికి బాధిత కాంట్రాక్టర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి**



సమావేశంలో మాట్లాడుతున్న బాధిత కాంట్రాక్టర్ పల్లపు చంద్రశేఖర్

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తమకు రావాల్సిన రూ.2.40 కోట్ల బకాయిలు చెల్లించి తమకు న్యాయం చేయాలని లేకుంటే తనకు చావే శరణ్య మని బాధిత కాంట్రాక్టర్ పల్లపు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని, సిఎంసి కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 లో నిర్వహించిన ఆన్‌లైన్ టెండర్లలో సివిల్ వర్క్స్ అను భవం ఉన్న తనకు శానిటేషన్ అనుభవం లేకపోవడంతో మిత్రుడి ద్వారా జేఎమ్‌సీ ప్రతినిధి జగన్‌ను సంప్రదిం చానని, సంస్థ పేరుతో టెండర్లు దక్కించుకునేందుకు (సబ్‌కాంట్రాక్ట్)అవసరమైన ఈఎమ్‌డీ మొత్తాలను తానే చెల్లించానని తెలిపారు. అనంతరం టిప్పర్లు, జేసీబీలు, హిటాచీలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ రాత్రి గార్బేజ్ తర లింపు పనులు చేసినప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో అక్రమా లు జరిగాయని ఆరోపించారు. అప్పటి ఏఈ, అనంతరం డీఈఈగా పనిచేసిన ధీరజ్ రెడ్డి కాంట్రాక్ట్ సంస్థతో కుమ్మక్కై తనకు తెలియకుండా ప్రభుత్వ నిధులను మళ్లిం చారని కంపెనీ నకిలీ ఖాతా సృష్టించి తన బావ లక్ష్మీ ్మనా రాయణతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను ఉపయో గించి జీఎస్టీతో కలిపి దాదాపు రూ.3 కోట్ల నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయని ఈ వ్యవహారంలో ప్రవీణ్ రెడ్డి అనే వ్యక్తి సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపించారు. రూ.60 లక్షల బకాయిలపై అసలు కాంట్రా క్టర్ జగన్‌ను ప్రశ్నించడంతో తనపై కిడ్నాప్ కేసు, ఎఫ్ఐ ఆర్ నమోదు చేయించినట్లు చంద్రశేఖర్ ఆరోపించారు. అనంతరం చందానగర్ మాజీ కార్పొరేటర్ మధ్యవర్తిత్వం తో రూ.60 లక్షలు రికవరీ అయినప్పటికీ, ఇంకా రూ.2. 40 కోట్లు రావాల్సి ఉందన్నారు. టెండర్లు, బిల్లులు, నిధుల మళ్లింపుపై వచ్చిన ఫిర్యాదులతో జీహెచ్ ఎంసీ /సీఎంసీ కమిషనర్ సమగ్ర విచారణకు ఆదేశించగా, విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పిం చారని, దాని ఆధారంగా ధీరజ్ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అయితే చర్యలు తీసుకున్నప్పటికీ తన బకా యిలు మాత్రం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన బకాయిలను ఇప్పించేందుకు కమిషనర్ ప్రత్యేక అధికారి నియమించి చొరవ తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కావాల నే తనకు నోటీసులు జారీ చేస్తున్న కూకట్‌పల్లి ఎస్ఈ శ్రీకాంతి పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ధీరజ్ రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. విజిలెన్స్ చర్యలతో పాటు తనకు రావాల్సిన బకాయిలను రికవరీ చేసి చెల్లించి, తనపై ఆధారపడిన టిప్పర్ యజమానులు, డ్రైవర్లకు రావాల్సిన బకాయిలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల పిఆర్‌సికి కమిటీ వేయండి

**-పెండింగ్ ఈపిఎఫ్ జిపిఎఫ్ సమస్యను పరిష్కరించండి**
**-ఎనర్జీ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీకి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జెఎసి వినతి**


ఎనర్జీస్పెషల్ ఛీఫ్ సెక్రటరీ నవీన్‌మిట్టల్‌తో చైర్మన్, రమేష్, కోచైర్మన్ అంజయ్య, కన్వీనర్ శివాజీ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు ఎందుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎనర్జీ) నవీన్ మిట్టల్ కోరింది. ఈమేరకు గురువారం జేఏసీ చైర్మన్ సిహెచ్.రమేష్, కోచైర్మన్ పి. అంజయ్య, కన్వీనర్ శివాజీ, కోకన్వీనర్ నాసర్ షరీఫ్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం నవీన్‌మిట్టల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ కోసం వెంటనే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన విధానాన్ని విద్యుత్ సంస్థల ఉద్యోగులకు కూడా వర్తింపజేసి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈపిఎఫ్ నుండి జిపిఎఫ్ మార్పు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే క్లియర్ చేయాలని విద్యుత్ సంస్థల్లోని వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుత ఉద్యోగుల కొరత కారణంగా విధుల్లో ఉన్న సిబ్బందిపై అధిక పనిభారం పడుతోందని, దీనివల్ల ఉద్యోగుల పనితీరుతో పాటు వినియోగదారులకు అందించే సేవలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. విద్యుత్ రంగ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కొత్త నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను కూడా జేఏసీ ప్రతినిధులు స్పెషల్ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై నవీన్ మిట్టల్ గారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంబంధిత శాఖలు విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో చర్చించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని.. ముఖ్యంగా 15 రోజుల్లో అన్ని విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే టిజిఆర్‌పి డిసిఎల్ విభజన ప్రక్రియ పూర్తయిన వెంటనే నాలుగు విద్యుత్ సంస్థల్లో బదిలీలు చేపట్టేలా చూస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నేతలు ఎండీ అక్బర్, కరెంట్‌రావు, రాజారవిచంద్ర, కె.వెంకటేశ్వర్లు, విజయ్, ప్రవీణ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు నిందితుల అరెస్ట్

**ఉప్పల్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు నిందితులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా సత్యనారాయణపురం కాలనీకి చెందిన రాచకొండ శ్రీనివాసాచారి (31) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఈనెల 24వ తేదిన రాత్రి విధులు ముగించుకుని నాగోల్‌లోని స్నేహితుడి ఇంటికి పుట్టిన రోజు వేడుకకు వెళ్లాలని తన స్కూటర్‌పై బయలుదేరి ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కళాశాల బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో అతను నిద్రలోకి జారుకున్న తర్వాత ఒక గుర్తు తెలియని వ్యక్తి అతని వద్దకు వచ్చి, అతని మెడలో ఉన్న సుమారు మూడు తులాల బరువున్న వెండి గొలుసును బలవంతంగా లాక్కొని, తన సహచరులతో కలిసి మోటార్ సైకిల్ మీద పారిపోయాడు. దీంతో అతను పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా విచారణ చేయగా బుధవారం సాయంత్రం 6 గంటలకు, నిందితులు ఒయు మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన బాణాల కార్తీక్ కుమార్ (19), జవహర్‌నగర్ బాలాజీ నగర్‌కు చెందిన నాంపల్లి శివ( 19), బేగంపేట బ్రహ్మణవాడికి చెందిన కండ్లకోయ గణేష్ ( 19)లను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఉప్పల్‌లోని రాజ్యలక్ష్మి ్మ దిజయేటర్ వద్ద అనుమానాస్పదస్తితిలో తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. మరొకరిని. ఉప్పల్‌లోని స్టేడియం మెట్రో వద్ద అరెస్టు చేశారు. నిందితులు ముగ్గురు చిన్ననాటి స్నేహితులని, గతంలో ఒకరు దొంగతనం కేసులలో పాలుపంచుకున్నారని తెలిపారు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి, తగినంత డబ్బు లేకపోవడంతో తిరిగి దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. వీరి వద్ద ఒక మోటార్ సైకిల్ , వెండి గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హత్య కేసు ఛేదన.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**అత్తాపూర్ ఆగస్టు27,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నెపాల్ యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ సుఫియాన్ సోహిల్ ఫరాష్ (21)తో పాటు 17 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. సిఐ వెంకటేష్ వివరాల ప్రకారం....నేపాల్‌కు చెందిన నాగేంద్ర (23) అత్తాపూర్‌లోని ఓ హోటల్‌లో చైనీస్ కుక్‌గా పనిచేస్తూ రాజేంద్రనగర్ జనచైతన్య ఫేజ్1లో భార్య చంద్ర బుధతో నివసిస్తున్నాడు. ఆగస్టు 24న రాత్రి 11 గంటల సమయంలో సిగరెట్ తాగేందుకు బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. దీంతో భార్య వెతుకుంటు వెళ్లగా ఆగస్టు 25న అర్ధరాత్రి సమయంలో ప్రణవ విల్లాస్ సమీపంలో తీవ్ర గాయాలతో మృతి చెంది కనిపించాడు. అతడి మొబైల్ ఫోన్ కూడా కనిపించలేదు. దర్యాప్తులో నిందితులు నాగేంద్రపై దాడి చేసి హత్య అనంతరం అతడి మొబైల్ ఫోన్‌ను తీసుకుని యాక్టివాపై పరారైనట్లు పోలీసులు గుర్తించారు. అయితే నిందితులు నిత్యం మొబైల్ ఫోన్ చోరిలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిందితుల నుంచి హోండా యాక్టివా, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్, ఏసీపీ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది కేసును ఛేదించారు.

## దివ్యాంగురాలు ఫింఛన్ కోసం ఎదురుచూపులు

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అభంశుభం తెలియని ఓ చిన్నారి బాలిక.. ఆడ పిల్లగా పుట్టడమే తన పాలిట శాపంగా మారిందా..పుట్టినప్పటి నుంచి కనీసం కదలలేని దీన స్థితిలో ఓ అభాగ్యురాలు.. కన్న తల్లిదండ్రుల ఎదుటే..దీన స్థితిలో బాలిక..చుట్టుపక్కల ఆడుకోవాల్సిన వయసులో మంచానికే పరిమితమైన బాలిక..వివరాల్లోకి వెళితే అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్ బస్తీలో నివసించే హౌగిస్వామి తల్లి పార్వతిలకు నలుగురు సంతానం ముగ్గురు ఆడపిల్లలు ఒక అబ్బాయి. కావేరి ప్రథమ పుత్రికగా జన్మించింది. పుట్టినప్పటి నుంచి కనీసం మాటలు కానీ ఎలాంటి కదలికగాని లేని స్థితిలో జన్మించింది. తండ్రి హౌగిస్వామి తోపుడు బండితో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కావేరి తల్లిదండ్రులు ఇద్దరు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే గత పదేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి నుంచి ప్రభుత్వం తరఫున దివ్యాంగురాలు కావేరికి ఫించన్ విషయమై స్థానిక ప్రజా ప్రతినిధులను విన్నవించుకున్నారు. ప్రభుత్వానికి దరఖాస్తు కూడా చేశారు. అయినా మంజూరు కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి తమ కూతురు దీనస్థితి చూసైనా కనికరించడం లేదని తల్లి పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక స్థితితో పాటు అంగవైకల్యంతో చిన్నారి జీవనం సాగిస్తుంటే ఏమాత్రం తమను ప్రభుత్వం ఆదుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా కావేరికి ప్రభుత్వం నుంచి నెలవారి ఫించన్ మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.


పోలీసులకు రాఖీ కడుతున్న విద్యార్థులు

## పోలీసు అన్నయ్యలకు ముందస్తు రక్షాబంధన్



**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో పోలీసు అన్నయ్యలకు ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం అసెంబ్లీ ఇన్‌చార్జ్ పుట్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. సీతారాంకు బీజేవైఎం నాయకులు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి, స్వీట్లు అందించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో కూడా విధుల్లో ఉంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అని, పోలీసు సిబ్బందితో సోదరభావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేవైఎం నాయకులు తెలిపారు. సమాజంలో శాంతి, భద్రత కోసం పోలీసులు చేస్తున్న కృషికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు వివేక్, విజయ్, ప్రశాంత్, రాధిక, నందిని, పూజ, ఫలక్, మనోజ్ఞ, శ్రేయ, హారిక, సరిత, నందిని, శ్రీనిధి, శ్రీజతో పాటు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంగేజ్‌మెంట్ రద్దు ..యువతి ఆత్మహత్య

**అత్తాపూర్ ఆగస్టు27,ప్రభాతవార్త :** ఎంగేజ్‌మెంట్ రద్దు అయిందని మనస్థాపానికి గురైన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉంటున్న సంగీత ఎంగేజ్‌మెంట్ కొన్ని రోజుల క్రితం జరుగగా అది రద్దు అయింది. దీంతో మనస్థాపానికి గురైన అమె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలుసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఫోన్లు అందజేస్తున్న దృశ్యం

## పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి బాధితులకు అప్పగింత

**మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న, దొంగిలించబడిన ఫోన్ల ను పోలీసులు రికవరీ చేసి తిరిగి ఫిర్యాదు దారులకు అప్పగిం చారు. పోలీసుల కథనం ప్రకారం... .సిఈఐఆర్ పోర్టల్ ద్వారావచ్చిన ధరఖాస్తుల ఆధారంగా ఐదు లక్షల,వెయ్యి రూపాయల విలువ చేసే 34 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. రికవరీ చేసిన 34 ఫోన్లను తిరిగి ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు.

## ఏకగ్రీవంగా ఎంపికైన కాలనీ నూతన కమిటీ


హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీ రోడ్ నెంబర్-3 నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 27 ప్రభాతవార్త :** హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ రోడ్ నెంబర్ -3 నూతన వెల్ఫే ర్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎంపికైంది. నూతన అధ్యక్షు లుగా నాగేష్, కార్యదర్శిగా వినాయకరావ్, కోశాధికారులుగా కోటేశ్వర్‌రెడ్డి, సరస్వతిలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ప్రజలందరి సహకారంతో పని చేస్తామన్నారు. కాలనీలో ఉన్న సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లి వేగంగా పరిష్కరించబడేలా మావంతు శక్తివంచన లేకుండా కష్టపడుతా మన్నారు. మాపై కాలనీ వాసులు ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు నిరంతరం పని చేస్తామన్నారు. మాకు ఈ బాధ్యను కట్టబెట్టిన కాలనీ వాసులందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నూతన కమిటీ ప్రతినిధులకు కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : దేవర వంశి

**కార్వాన్ ఆగస్టు27,ప్రభాతవార్త :** మన కరెంట్‌ను అదానీ చేతుల్లో పెట్టొద్దని, ప్రభుత్వ పరిధిలోనే మన కరెంటు ఉండాలని భారతీయ జనతా పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశి అన్నారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామని ,సెల్ ఫోన్లు రీ ఛార్జ్ చేసుకున్నట్టు కరెంట్ మీటర్లు రీ ఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ సరఫరా చేస్తామనడం అప్రజాస్వామికమైన చర్యయని, ఉచిత కరెంట్‌ను ఎత్తివేసేందుకే రేవంత్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తెరపైకి తెస్తున్నారు. మన కరెంట్‌ను అదానీ చేతుల్లో పెట్టవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో కరెంటు మీటర్లను ఏర్పాటు చేస్తే ప్రజా గ్రహానికి గురి కావలసి వస్తుందనిదేవర వంశి హెచ్చరించారు.

## డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌పై అభ్యంతరాలు తెలియజేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం ఈఆర్ఓ అరుణ కుమారి, టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ పులిపాటి రాహుల్, కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో పేర్లపై అభ్యంతరాలను వచ్చే నెల 16వ తేదీ లోగా తెలియజేయ వచ్చునని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ పులిపాటి రాహుల్ అన్నారు. బహదూర్‌పుర నియోజకవర్గం పరిధిలోని దూద్‌బౌలిలో గురువారం ఎలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహించిన వార్డు సభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కృషి వల్లనే తెలంగాణ వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నారని తెలిపారు. అర్హులై ఉండి డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో పేరు లేని వారు, అక్టోబర్ నెల ఒకటి తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న ప్రతీ ఒక్కరూ ఫారం 6 ద్వారా కొత్తగా ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలియజేశారు. బహదూర్‌పుర నియోజకవర్గం ఈఆర్ఓ అరుణ కుమారి వార్డు సభలో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ వివరాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దూద్‌బౌలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాను యాదవ్, హైదరాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి శెట్టి పాల్గొన్నారు.



## అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ : రామకృష్ణారెడ్డి

**నార్సింగి, ఆగస్టు 27 ప్రభాతవార్త :** అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మణికొండలోని లోటస్ స్కూల్‌లో విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వెళ్లిన రామకృష్ణారెడ్డికి పాఠశాల విద్యార్థినులు రాఖీలు కట్టారు. అనంతరం బాలురకు బాలికలు రాఖీలు కట్టి నీవు నాకు రక్షా, నేను నీకు రక్షా, మనమిద్దరం దేశానికి రక్షా అని నినదించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సోదర-సోదీరమణుల మధ్య ప్రాణం ఉన్నంత వరకు బంధం కొనసాగాలన్న ఉద్దేశంతోనే మన మహర్షులు ఈ రాఖీ పండగను మన సంస్కృతిలో భాగం చేశారని వివరించారు. సనాతన ధర్మంలో చేసే ప్రతీ పర్వదినం వెనుకాల ఆరోగ్యం, ఆత్మీయత, అనురాగం, ఆనందం దాగి ఉంటాయని తెలిపారు. మన మహర్షులు చూపిన దారిలో మనం నడిస్తే ఆరోగ్యం, అనుబంధం బాగుంటాయని, సమ సమాజం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కుమార్, ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బేగంపేట పోలీసు స్టేషన్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**బేగంపేట, ఆగస్టు 27,ప్రభాతవార్త :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత, సాధికారత మరియు కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసే లక్ష ్యంతో సీపీ బి. సుమతి ఆలోచనతో ప్రారంభమైన మీ సురక్ష - సహచర్రి కార్యక్రమంలో భాగంగా బేగంపేట పోలీస్ స్టేషన్‌లో సహచర్రి సభ్యులతో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలను సహచర్రి కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, మహిళల రక్షణ, సైబర్ భద్రత, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు నేరాల నివారణలో పోలీసులతో కలిసి పనిచేసేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 3,000 మందికి పైగా మహిళలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సహచరి సభ్యులు పోలీసు అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటరు సవరణకు బిఎల్‌ఓలతో సహకరించాలి


చీర్యాల గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**కీసర, ఆగస్టు27, ప్రభాతవార్త:** ఓటరు సవరణ జాబితాకు ప్రతి ఒక్క ఓటరు బిఎల్‌ఓలతో సహకరించాలని అవసరమైన డాక్యుమెంట్లు ఇవ్వాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామంలో సర్‌పై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభ పూర్తి పారదర్శకతతో, నిబందనల ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటరు సవరణపై ఎలాంటి సందేహాలు ఉన్న గ్రామసభలో నివృత్తి చేసుకోవాలన్నారు. 2002లో ఓటరు జాబితాలో ఉన్న వివరాలు, ప్రస్తుతం ఉన్న జాబితాలో వివరాలు సరిచూడడం జరిగిందన్నారు. మీరు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలలో 2002 నాటి వివరాలు లేకపోయినట్లయితే చిన్న చిన్న సవరణలు ఉన్నట్లయితే డాక్యుమెంట్స్ వెరిఫై చేసుకుని సవరణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్స్ బిఎల్‌ఓలు వచ్చి నోటీస్ ఇస్తారు, ఓటరుకు సంబందించి డాక్యుమెంట్స్ ఇవ్వగలిగితే మీ పేరు ఫైనల్ జాబితాలో ఉంటుందని, ప్రతి ఒక్క ఓటరు బిఎల్‌ఓలతో సహకరించాలని సూచించారు. ఓటరు సవరణకు సంబందించి 11 డాక్యుమెంట్లు ఏవైతే ఉన్నాయో, మీ దగ్గర ఏది అందుబాటులో ఉందని చూసుకుని ఆ డాక్యుమెంట్స్ బిఎల్‌ఓలకు ఇస్తే తప్పకుండా ఫైనల్ పబ్లికేషన్ చేసేటప్పుడు మీ పేరు, మీ కుటుంబ సభ్యుల వారందరి పేర్లు కూడా వస్తాయన్నారు. బిఎల్‌ఓలు తమ తమ బూతులలో ఓటరు లిస్టులలో మరణించిన, డబుల్ ఎన్‌రోల్ అయిన వారి పేర్లను చదివి వినిపించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫార్మ్ 6, చనిపోయిన వాళ్లకు సంబందించినది ఫార్మ్ 7 ఎటువంటి సవరణలు చేయాలన్నా అంటే పేరు, ఫోన్ నబంరు, అడ్రస్ వంటి ఎలాంటి సవరణలు ఉన్న ఫార్మ్ 8లో చేసుకోవాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్‌డిఓ వెంకటొరెడ్డి, తహశీల్దార్ యాదగిరిరెడ్డి, బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతపైనే దేశభవిష్యత్తు

**చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలి**


జాతీయ క్రీడాకారులకు మెమెంటో అందజేసిన ఎంపి డికె అరుణ.

**నందిగామ, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మారుతున్న సమాజంలో యువతీ దైవ భక్తితో పాటు దేశభక్తి అలవర్చుకోవాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. భారత ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ, జాతీయ క్రీడా దినోత్సవం 2026 లో భాగంగా గురువారం సింబాసిస్ యూనివర్సిటీలో కేల్ ఇండియా సంహద్ కేల్ కి బాత్ పిఎంకె సాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా ఆమె విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, సాధించాలనే తపన ఉంటే విజయాలు సొంతమవుతాయన్నారు. మాదక ద్రవ్య రహిత నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత మరియు బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఎమ్మెస్ ముస్కాన్ ఖాన్. మైభారత్ ప్రతినిధులు డి. శ్రీశైలం యాదవ్ ,గ్రీష్మ, కృతి సింబాయాసిస్ యునివర్సిటి యాజమాన్యం డైరెక్టర్లు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో ఉండేటట్టు చూడాలి


గ్రామ సభలో పాల్గొన్న అధికారులు ,సర్పంచ్,గ్రామస్తులు

**కేశంపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటర్ జాబితాలో పేర్లు ఉండేటట్టు చూడాలని ఎదవెల్లి సర్పంచ్ చెదురువల్లి భాస్కర్ అన్నారు. కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలో ఎస్ఐఆర్ పై గురువారం పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా సవరణ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం, వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవడం వంటి అంశాలపై గ్రామస్థులకుగ్రామ సర్పంచ్ భాస్కర్ అవగాహన కల్పిస్తూ ప్రక్రియపై గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ వెంకటయ్య, ఉపసర్పంచ్ సఫూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రమేష్ నాయక్, రిజ్వాన బేగం మోహిజ్, మంజుల జంగేశ్, అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, సులోచన, వనజ అధికారులు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం వైపే విద్యార్థుల అడుగులు పడాలి..!


హాజరైన విద్యార్థులు

**చేవెళ్ల, ఆగస్టు 27, ప్రభాతవార్త :** లక్ష్యసాధనలో విద్యార్థులు వెనకడుగు వేయొద్దు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రముఖ వక్త హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్ లో స్థానిక వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ సి. జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డిల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త హన్మంత్ రెడ్డి, ముఖ్య అతిథిగా సీఐ నరేందర్ రెడ్డిలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన దిశగా ముందడుగు వేయాలన్నారు. సమయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వృథా చేయకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హితవు పలికారు. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, కళాశాల దశ నుంచే క్రమశిక్షణను జీవన విధానంగా మలచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఖాయమని స్పష్టం చేశారు. అదేవిధంగా ముఖ్య అతిథి సీఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేటి సైబర్ యుగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు వహిస్తూ, చెడు సావాసాలకు, మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అంతకుముందు సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆత్మీయ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద, సినీ నృత్యాలు సభను విశేషంగా ఆకట్టుకున్నాయి. తోటి విద్యార్థుల ఈలలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచారం డివిజన్ కాంగ్రెస్ కమిటీలో 20 మందికి పదవుల నియమాకం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులను నియమించినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ గురువారం తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ చేతుల మీదుగా నియమాక ప్రక్రియ పూర్తయ్యినట్లు తెలిపారు. పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇదివరకే నియమితులైన కర్రె రాజేశ్ మిగతా డివిజన్ కార్యవర్గ సభ్యుల వివరాలు ప్రకటించాడు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మెట్టు గణేశ్ యాదవ్, ఆర్. భోజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కె. చంద్రమౌళి, చెట్టిపల్లి ముత్యం, యు. ఆంజనేయులు గౌడ్, కొంతం శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బద్దం నర్సింహారెడ్డి, కార్యదర్శులుగా పసులాది నర్సింగ్ ముదిరాజ్, డి.దేవేందర్ ముదిరాజ్, కోశాధికారిగా బద్దం మల్లికార్జున్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బైండ్ల జంగయ్య, బి. శ్రీనివాస్ గౌడ్, కె. జంగయ్య, సోషల్ మిడియా ప్రతినిధులుగా పి. నాగరాజు గౌడ్, కె. వంశీ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, చిన్న నర్సింహులు గౌడ్, గ్యార అనసూయ, ఉదారి వేణుగోపాల్ ముదిరాజ్‌లను నియమించినట్లు తెలిపారు.

**అంబేద్కర్ అభయ హస్తం అమలుకాకపోతే**

## కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వం..

**బొంకూరి సురేందర్ సన్ని, కండెల వెంకటేశ్వర్లు...**

**చేవెళ్ల, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అణచివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ అభయాసం పేరుతో అమలు చేస్తామని చెప్పిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బొంకూరి సురేందర్ సన్ని కండెల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల లో దళిత, గిరిజన,ఆదివాసి జె. ఎ. సి నాయకులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేవెళ్లలో భారీ భహిరంగ సభ ను ఏర్పాటు చేసి తెలంగాణ లోని దళిత, గిరిజన, ఆదివాసి ప్రజలను అభివృద్ధి చేస్తామని చెప్పారని, అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12లక్షలను అందిస్తామన్నారన్నారు. మూడు ఎస్సీ కార్పొరేషన్‌లను అందిస్తామని, ఎస్టీ లకు మూడు కార్పొరేషన్ లను ఏర్పాటు చేస్తామని 12అంశాలతో కూడిన వాగ్దానలను 2023న చేవెళ్లలోని కే వీ ఆర్ గ్రౌండ్ లో మల్లికార్జున కర్గే, రేవంత్ రెడ్డి, దామోదర రాజ నర్సింహా, మల్లు బట్టి విక్రమార్క, సంపత్ కుమార్, బెల్లయ్య నాయక్, నాగరిగారి ప్రితం ప్రకటించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి మంత్రి వర్గ సమావేశం లోనే అమలు పరుస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఇచ్చి నేటికీ మూడు సంవత్సరం లు అవుతున్నప్పటికి హామీలను అమలు పరిచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నరన్నారు. ఇప్పటికైనా పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన,ఆదివాసి జె. ఎ. సి నాయకులు బొంగు వెంకటేష్ గౌడ్ కండెల పెద్ద వేంకటేష్ మద్దెల భవాని కళ్లెపల్లి రవి వనం గంగయ్య మిట్టపెల్లి రాధిక వనం పుల్లయ్య మిక్కిలి సుంకయ్య జగన్నాధం మహేష్ జగన్నాధం శేఖర్ మ్యారడి అంజయ్య వనం కావేరి వనం లలిత వనం పద్మ మద్దెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


దళిత గిరిజన ఆదివాసి జేఏసీ నాయకులు


జిటికె 4 అవుషాపూర్‌లో ఎస్ఐఆర్ వార్డుసభలో పాల్గొన్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

## ఓటర్ల జాబితాలో సవరణలు చేసుకోండి

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవాలని ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్ చెట్టి చంద్రశేఖర్ సూచించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ పాత గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా వార్డుసభ నిర్వహించారు. నాయబ్ తహశీల్దార్ చంద్రశేఖర్, విఆర్ఓ ప్రతిభలు హజరై ప్రజలకు జాబితాలో సవరణలపై అవగాహన కల్పించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్న మార్పులు, చేర్పులు చేసుకోవడానికి నిర్ణిత ఫారం నింపి బిఎల్‌ఓకు అందజేయాలని ఆయన సూచించారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, మాజీ సర్పంచ్ పెద్దోళ్ల రమేశ్, మాజీ ఉపసర్పంచ్ ఎలసాని ఐలయ్యయాదవ్, గడ్డిఅన్నారం మార్కెట్ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకటొరెడ్డి, కొలిచెలిమి వీరేశం, డొంకెన శంకర్‌గౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కవాడి మాధవరెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, నాగరాజు, దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, భాస్కర్‌గౌడ్, నరేష్‌గౌడ్, ఎలుసాని చిన్నయాదవ్, ప్రభాకర్‌గౌడ్, జి.కృష్ణ, జిల్లాల ప్రభాకర్‌రెడ్డి, ఆముదాల సతీష్‌గౌడ్, బిఎల్‌వోలు, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ తహశీల్దార్ ఫోర్జరీ లేఖపై కేసు నమోదు

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తహశీల్దార్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ లేఖ సృష్టించి సోషల్‌మీడియాలో వైరల్ చేసి రిజిస్ట్రేషన్ రద్దుకు యత్నించిన వైనం ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మండల తహశీల్దార్ చంద్రశేఖర్ పేరుతో నకిలీ అధికారిక లేఖను సృష్టించి, ఫోర్జరీ సంతకంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన ఘటనపై ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ అన్నోజిగూడ సర్వే నెం. 93/అ లో 2 ఎకరాల 18 గుంటల పట్టా భూమికి సంబంధించి దరఖాస్తు నెం. 2600170044 ద్వారా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, చెల్లించిన చలానా మొత్తాన్ని రీఫండ్ చేయాలని కోరుతూ తహశీల్దార్ నుంచి ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్‌కు ఒక అధికారిక లేఖ వెలువడినట్లు సామాజిక మాధ్యమాలో ప్రచారం జరిగింది. లేఖను పరిశీలించగా అది ఘట్‌కేసర్ తహశీల్దార్ కార్యాలయం నుంచి జారీ కాలేదని, తహశీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ లేఖను సృష్టించినట్లు తేలింది. ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి, అధికారిక ముద్రను దుర్వినియోగం చేస్తూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆటంకం కలిగించే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు ఈ నకిలీ పత్రాన్ని తయారు చేసి వాట్సాప్ తదితర మాధ్యమాల్లో సర్క్యులేట్ చేసినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు.



## నేరాల కట్టడిలో సహచారుల పాత్ర కీలకం

**రక్షాబంధన్ సందర్భంగా సహచారులకు బహుమతులు అందజేసిన జవహర్‌నగర్ పోలీసులు.**

**జవహర్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** నేరాల నియత్రణలో పోలీసులకు సహకరిస్తున్న సహచారుల సేవలను జవహర్‌నగర్ పోలీసులు అభినందిచారు. రక్షాబంధన్ సందర్భంగా సహచారి కార్యక్రమంలో భాగంగా పోలిసుస్టేషన్‌లో ఇన్‌స్పక్టర్ ఎస్.సైదులు, ఎస్ఐ బి.రాము, సిబ్బంది సహచారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా నేరాల నియంత్రణలో వారు అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా బహుమతి ప్యాకెట్లను అందజేశారు. సహచారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పోలిసులు హామి ఇచ్చారు. ప్రాంతంలో ప్రజా సమస్యలు, నేరాలు, అసాంఘిక కార్యకలపాలకు సంబంధిచిన సమాచారన్ని ఎప్పటికప్పుడు పోలిసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలిసులకు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తు సహచారులు అందిస్తున్న సహకారం సమాజ భద్రతకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## తూంకుంట శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

**శామీర్‌పేట, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీ నుంచి 31వరకు తూంకుంటలోని శ్రీగాయత్రీ మహాక్షేత్రంలోని శ్రీరాఘవేంద్రస్వామి 355వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు భక్తులు పాల్గొనాలని ఆలయ ధర్మకర్త డాక్టర్ ఎస్‌విఎల్‌ఎన్ మూర్తి తెలిపారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి 355వ ఆరాధన ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆరాధన ఉత్సవాలు వేదపండితులు నియమనిష్టలతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల వారితో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనటం జరుగుతుందని అన్నారు. ఈ శ్రీస్వామి వారి ఆరాధన ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకోవాలని ఆయన కోరారు.


తూంకుంటలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలోని శ్రీరాఘవేంద్రస్వామి పూజలు అందుకుంటున్న దృశ్యం

## చీపునుంతలలో విద్యుత్ దీపాల ఏర్పాటు

**తలకొండపల్లి, అక్టోబర్ 27 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో గురువారం నాడు గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆసన్న, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని స్తంభాలకు నూతనంగా లైట్లు ఏర్పాటు చేశారు. చీపునుంతల గేటు సమీపం దొంగరోడు నుంచి చీపునుంతల గ్రామం వరకు నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను అమర్చారు. ఈ సందర్భంగా గుజ్జుల మహేష్ మాట్లాడుతూ గ్రామంలో బోనాలు సమీపిస్తున్నందున గ్రామ ప్రజలందరి సౌకర్యం మేరకు విద్యుత్ విపాల అలంకరణ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.


విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న నాయకులు

## ప్రతి ఓటరు తమ ఓటు ఉండే విధంగా సరి చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

**తలకొండపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగ రావు పల్లి గ్రామంలో గురువారం నాడు ఎలక్షన్ కమిషన్ ఆదేశం మేరకు గురువారం నాడు గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సమావేశంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ఓటర్లు అందరూ తమ ఓటు ను ఓటర్ లిస్టులో సరి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు కోల్పోకుండా గ్రామంలోని బిఎల్ఓ లకు సంబంధిత గుర్తింపు పత్రాలు అందజేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రజలందరూ తమ ఓటును కోల్పోకుండా ప్రభుత్వం సూచించిన గుర్తింపు కార్డులను అందజేసి ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు రాబోయే రోజులలో ఓటు హక్కు ఎంతో కీలకమవుతుందని, తన భవిష్యత్తును మార్చేందుకు ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు కోల్పోకుండా సరిచేసుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన తెలియజేశారు. ఓటు కోల్పోయిన వారు నూతనంగా మళ్ళీ ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

**తలకొండపల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గురువారం నాడు వరిపంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాంపూర్ గ్రామంలోని రైతు చిన్న హరిమోహన్ రెడ్డి పొలంవద్దకు వెళ్లి వరిపంటను పరిశీలించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు పలు వురు రైతులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు దిలీప్ కెవికె చౌహన్ లు హాజరై రైతులకు వరి పంట సాగుపై పలు మెలకువలు అవగాహన కల్పించారు. ఒరిస్సాగులో అనికర పురుగుల గుర్తింపు పురుగుల మందు వాడకం దిగుబడి అంచనా సమాచార మార్పిడి క్షేత్ర ప్రయోగాల పద్ధతిని రైతులకు సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలోని వరి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వట్టేలా నిర్మల శ్రీశైలం యాదవ్, మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, అధికారులు దిలీప్ కెవికె చవన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ డిఆర్ఓ మంగీలాల్ అనారోగ్యంతో మృతి

**వికారాబాద్, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించిన మంగీలాల్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక మెడికల్ సెలవు పై వెళ్ళారు. ఆయన స్థానంలో ఇంచార్జి డీఆర్ఓగా స్వర్ణలత విధుల్లో కొనసాగుతుంది. మంగీలాల్ ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఈ విషయమై వికారాబాద్ కలెక్టర్ కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. మంగీలాల్ డీఆర్వోగా పనిచేసిన కొద్దికాలంలోనే మంచి పరిపాలనా నైపుణ్యంతో విధులు నిర్వర్తించారని వారు కొనియాడారు. ప్రజా సేవలో చక్కటి పనితీరు కనబరిచిన అధికారిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మంగీలాల్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## సోదరీ, సోదరుల అనురాగానికి రాఖీ ప్రతీక

**ఘట్‌కేసర్, ఆగష్టు27, ప్రభాతవార్త:** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమను, అనుబంధాన్ని తెలియజేసేదే రక్షాబంధన్ అని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. సహచరీలో భాగంగా ఘట్‌కేసర్ పోలీసులు రక్షాబంధన్ సందర్భంగా గురువారం స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాళ్ల ఇళ్లకు వెళ్లి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. 10 మంది సహచరీలకు (ఎస్‌హెచ్‌జి) కానుకలు అందజేసి వారితో రక్షాబంధన్ సందర్భంగా రాఖీ కట్టించుకున్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో సహచరీ కన్యాకుమారీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామికి రాఖీ కట్టగా ఎదులాబాద్ డివిజన్ మర్రిపల్లిగూడలో సహచరీ సరిత ఎస్ఐ శేఖర్‌కు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. మరో 8 మంది సహచరీలతో పోలీసు సిబ్బంది రాఖీలు కట్టించుకోగా శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఇన్‌స్పెక్టర్ బాలస్వామికి రాఖీ కడుతున్న కన్యాకుమారీ

# రోడ్డు ప్రమాదం

**రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి**

**శంషాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** పెద్దషాపూర్ బస్‌స్టాప్ సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 79 ఏళ్ల రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెందిన ఘటన శంషాబాద్ ఫ్యూచర్ సిటి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం...పెద్దషాపూర్‌కు చెందిన మల్లేపల్లి బిక్షపతి తన కుమారుడు షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న ఇంటి పనులను చూసేందుకు బస్సులో వెళ్లాలని ఇంటి నుంచి బయలుదేరారు. ఉదయం సుమారు 8.40 గంటల సమయంలో పెద్దషాపూర్ బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా.. కొత్తూరు నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న నంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్ ఆయనను కుడివైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బిక్షపతికి తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలతో పాటు కుడి చేతికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తొండుపల్లి లిమ్స్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను గుర్తించిన పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సెప్టెంబర్ 16 వరకు మార్పులు చేర్పులకు అవకాశం

**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సెప్టెంబర్ 16 వరకు ధరఖాస్తు చేసుకోవాలని ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్ చెట్టి చంద్రశేఖర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పాతగ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎస్ఐఆర్ అవగాహన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండినవారు నేరుగా బీఎల్ఓ దగ్గరకు వెళ్లి ఫారం 6 ఇచ్చి ఓటు నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు నమోదైతే సవరించుకోవాలని, వచ్చే నెల 16 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కొత్త ఓటరు నమోదు, పేర్లతో తప్పుల సవరణ, చిరునామా మార్పు తదితర అంశాలపై ఆయన నాయకుల సందేహాలను నివృత్తి చేశారు. ఈసందర్బంగా పలువురు సవరణల కోసం డిటికి ధరఖాస్తులను అందజేశారు. ఈకార్యక్రమంలో జిపిఓ మాధవరెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, మాజీ సర్పంచ్ బట్టె శంకర్, పోలు భాస్కర్‌గౌడ్, చిత్తరంజన్, తాటికొండ మల్లేశ్‌గౌడ్, బిఎల్‌ఓలు, బిఎల్ఏలు పాల్గొన్నారు.




భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి పోచారం డివిజన్ కన్వీనర్‌గా నియమితులైన సామల సత్తిరెడ్డిని అభినందిస్తున్న గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు.

## భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి పోచారం డివిజన్ కన్వీనర్‌గా సామల సత్తిరెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా సామల సత్తిరెడ్డి నియమితులయ్యారు. పోచారంలో గురువారం జరిగిన సమావేశంలో ఖదిరేష్ గురుస్వామి చేతుల మీదుగా సామల సత్తిరెడ్డికి నియమాక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ కో కన్వీనర్ భానుయాదవ్, వెంకట్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు సమవేశమై కన్వీనర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గణేశ్ ఉత్సవ సమితి పోచారం డివిజన్ కన్వీనర్‌గా నియమితులైన సామల సత్తిరెడ్డి మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అన్నారు. హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంప్రదాయబద్ధంగా గణేశ్ మండపాల ఏర్పాటు, పూజా కార్యక్రమాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా కృషి చేస్తానని అన్నారు. హిందూ బంధువులందరు ఐక్యంగా కలిసి గణేశ్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి ద్వారా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లుట్ల కృష్ణ, కొండల్‌రెడ్డి, బాలరాజు, శేఖర్ రెడ్డి, విష్ణు, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, గుండె వెంకటేశ్, చర్ల రాజేందర్‌రెడ్డి, అశోక్, గుండె నరేశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు మన సంస్కతి సంప్రదాయాలకు ప్రతీకలు



పోచారం డివిజన్ నారపల్లిలో కట్ట మైసమ్మ, కట్టపోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు.

మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** గ్రామ దేవతల పండుగలు మన సంస్కతి సంప్రదాయాలకు ప్రతీకలుయని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బి. కొండల్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లిలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ, కట్టపోచమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టపూజలు జరిగాయి. గురువారం బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవాలయాల కమిటీ అధ్యక్షుడు అబ్బవతి నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామ ప్రజల ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బెజ్జంకి హరిప్రసాద్ రావు, చింతల రాజశేఖర్, సుర్వీ రవీందర్ గౌడ్, స్థానిక నాయకులు సుర్వీ శ్రీనివాస్ గౌడ్, మందాడి నరేందర్ రెడ్డి, అయోధ్య, లక్ష్మణ్ నాయక్, సంతోశ్ నాయక్, కొమ్ముల ప్రశాంత్, మీసాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

తహసీల్దారు,ఎంపిడిఓకు వినతి పత్రాన్ని అందజేసిన సర్పంచ్ యాదవరెడ్డి



పూడూరు తహసీల్దారు విజయ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ సిద్ధన్నగారి యాదవరెడ్డి,తదితరులు

**పూడూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూమిని ఆక్రమించి బోరుబావిని త్రవ్వించిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకొనిస్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ గురువారం గ్రామ సర్పంచ్ సిద్ధన్నగారి యాదవరెడ్డి ఆధ్వర్యంలో అంగడి చిట్టంపల్లి గ్రామస్తులు పూడూరు తహసీల్దారు విజయ్ కుమార్,ఎంపిడిఓ సుందర్‌కు వేరువేరుగా వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామానికి చెందిన బంటు వేణు అనేవ్యక్తి ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో ఆక్రమించి బోరుబావిని తవ్వించారని ఆరోపించారు. ఇట్టి విషయమై గ్రామస్తుల సమక్షంలో పలుమార్లు సదరు వ్యక్తికి నచ్చజెప్పినా వినిపించుకోక పోవడంతోపాటు ఈమధ్య తన ఇంటిముందు పాఠశాలకు వెళ్లేదారిలో అండర్‌డ్రైనేజీపైన గోడనిర్మాణం చేపట్టి కబ్జా చేస్తున్నారని వివరించారు. పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా కబ్జాచేసిన స్థలంతోపాటు బోరుబావిని తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి మాజీ చైర్మన్ బండల అంజయ్య, నాయకులు కొండి పెంటయ్య, నారెగూడెం రాంచెంద్రయ్య, మల్గ నర్సింలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుకు మరొక అవకాశం ఇచ్చేందుకే గ్రామ సభలు




పోచారం డివిజన్ చౌదరిగూడలో సర్ కార్యక్రమంపై నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడుతున్న ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్ర శేఖర్.

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉంటుందని ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తాహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు.

పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగూడ పాత గ్రామ పంచాయతీ భవనం వద్ద గురువారం సర్ ( ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ) గ్రామ సభ జరిగింది. ఘట్‌కేసర్ తాహసీల్దార్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ తమ ఓటు హక్కుపై ఎమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు కల్గిన వారందరికీ ఫారాలు అందజేసి తిరిగి తీసుకోవడం జరిగింది.

ఎవరైన ఫారాలు అందజేయని వారికి మాత్రమే తమ ఓటు హక్కు పొందేందుకు ప్రభుత్వం మరొక అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫారాలు సమర్పించని వారికి నోటీసులు ఇచ్చామని వారు వాటికి జవాబు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. కావ్య, స్థానిక నాయకులు మంద స్వామిదాస్, పి. దామోదర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా రాఖీ పండుగ



పోలీసులకు రాఖీ కడుతున్న సరస్వతి శిశు మందిర్ విద్యార్థినీలు



సరస్వతి శిశు మందిర్‌లో వరలక్ష్మీవత్రం నిర్వహిస్తున్న దృశ్యం

**పరిగి టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల పరిధిలో రాఖీ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీలు, విద్యార్థినిలు ఆచార్యులకు, ప్రధానాచార్యులకు రాఖీలు కట్టి నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనమంతా దేశానికి రక్ష" అనే సందేశాన్ని అందించారు. విద్యార్థినిలు విద్యార్థులకు, ఆచార్యులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అలాగే ఆయాలు, మాతాజీలు, విద్యార్థినిలు పాఠశాల డ్రైవర్ అన్నలకు రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకున్నారు. అదేవిధంగా విద్యార్థినిలు, మాతాజీలు పోలీస్ అన్నలకు రాఖీలు కట్టి వారి సేవలను అభినందించారు. రిజిస్టర్ కార్యాలయం లోని సిబ్బందికి కూడా రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగ విశిష్టతను, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు కే. మల్లేష్ మాట్లాడుతూ, రాఖీ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, పరస్పర ప్రేమ, ఆత్మీయత, సోదరభావం, రక్షణ మరియు దేశభక్తికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొం దించడంతో పాటు, సమాజం పట్ల బాధ్యతను, దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతి – మన సంప్రదాయం – మన బాధ్యత" అనే భావనతో రాఖీ పండుగను సమాజంలోని వివిధ వర్గాలతో కలిసి జరుపుకోవడం ద్వారా ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం మరింత బలపడుతాయని ప్రధానాచార్యులు మల్లేష్ తెలియజేశారు.

# ప్రతి పౌరుడు ఓటరు జాబితా సరిచూసుకోవాలి




నాగారం వార్డు సభలో మాట్లాడుతున్న డిప్యూటి కమీషనర్ వాణిరెడ్డి

**కీసర,ఆగస్టు27,ప్రభాతవార్త:** అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా ఉందోల లేదో సరిచూసుకోవాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమీషనర్ వాణిరెడ్డి కోరారు. గురువారం నాగారం డివిజన్ పరిధిలోని పోస్ట్ సర్ 2026 కార్యక్రమానికి సంబందించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వార్డు సభను నిర్వహించారు. ఓటర్ల జాబితాకు సంబందించిన అంశాలు, ఓటర్ల వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు అభ్యంతరాలు, అవసరమైన పత్రాల సమర్పణ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని ఏమైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబందిత అధికారులకు తెలియజేసి అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఏలు, బిఎల్ఓలు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మినరల్ వాటర్ ఫిల్టర్ ప్రారంభం

-సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి



ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ఫిల్టర్ ప్రారంభిస్తున్న సర్పంచ్ ,ఇతర నేతలు ,గ్రామస్తులు

**కేశంపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సురక్షి తమైన తాగునీరు అందించేందుకు శుద్ధి చేసిన మినరల్ వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో, గ్రామ సర్పంచ్ బీసీ కవిత కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఈ వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ..ఆరోగ్య పరిరక్షణ వేసవి దృష్ట్యా మరియు విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శుద్ధమైన తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

నాయకుల సహకారం విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చి 18 వేల రూపాయల విలువైన ఫిల్టర్ ఏర్పాటుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులను, దాతలను ఈ సందర్భంగా సర్పంచ్ అభినందించారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి నాయక్, మాజీ ఎంపిటిసి రంగయ్య, నరసింహారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, లచ్చిరాం నాయక్, కందిన సంతోష, శివయ్య, ప్రేమలత, యాదయ్య, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చిట్టి రెడ్డి వెంకటరెడ్డి, గుత్తి శేఖర్, సుధాకర్ రెడ్డి, సుజీవన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి శంబుల శేఖర్, మాధవరెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రక్షాబంధన్..కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట



ఘట్‌కేసర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



ఘట్‌కేసర్ బైపాస్ రహదారి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో వరుస పండుగలతో దుకాణాలన్ని కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. శ్రావణ పౌర్ణమి సందర్భంగా పట్టణంలో మార్కెట్ కిటకిటలాడింది. రాఖీ, మిఠాయి, పూజాసామాగ్రి, పూలు, పండ్ల అమ్మకాలు జోరుగా జరిగాయి. పట్టణంలో పలు చోట్ల ప్రధాన కూడళ్లలో తాత్కాలిక రాఖీ దుకాణాలు వెలిశాయి. వ్యాపారులు పూలు, పండ్ల ధరలను పెంచి విక్రయాలు చేస్తున్నారు. మార్కెట్‌లో సందడి చేస్తున్న వివిధ రకాల రాఖీలను మహిళలు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. పట్టణంలో రోడ్డుపైనే అమ్మకాలు చేస్తుండటంతో వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ ఆటంకం కల్గుతున్నది. మట్టి రాఖీలు, పర్యావరణ హితమైన రాఖీలు, పిల్లలను ఆకట్టుకునే రకరకాల డిజైన్ల రాఖీలకు మంచి డిమాండ్ ఉంది. బట్టల వ్యాపారం, రాఖీలతో పాటు స్వీట్ షాపులు, గిఫ్ట్ ఆర్టికల్స్ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. శుక్రవారం రక్షాబంధన్ కావడంతో ఒక రోజు ముందుగానే మహిళలు మార్కెట్‌కు వచ్చి రాఖీలు, మిఠాయిలు కొనుగోలు చేశారు. అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల అనురాగం, అప్యాయతకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించేందుకు రాఖీ, మిఠాయిలను కొనుగోలు చేస్తుండగా సోదరి మణులకు అందుకు కానుకలు అందించేందుకు సోదరులు వస్త్రాలు, ఇతర కానుకలు సేకరిస్తున్నారు. రాఖీ పండుగకు మహిళలు తమ తోబుట్టుల ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టేందుకు ప్రయాణాలు మొదలుపెట్టారు. రైలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలలో రద్దీ నెలకొంది. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్, బస్‌టెర్మినల్, బైపాస్ రహదారి వద్ద బస్‌స్టాప్‌లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. విద్యాసంస్థలకు, కార్యాలయాలకు సెలవులు రావడంతో జనాలు తమ సొంతస్థలాలకు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై వేలాది వాహనాలు ఘట్‌కేసర్ మీదుగా బారులు తీరి యాదాద్రిభువనగిరి, జనగాం, వరంగల్‌జిల్లాల వైపు వెళ్తున్నాయి. హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ గంట గంటకు విపరీతంగా పెరుగుతున్నది.

## జవహర్‌నగర్‌లో ఇళ్ల అనుమతులు,కొత్త ఇంటి నంబర్లపై సమీక్ష

**జవహర్‌నగర్,ఆగస్టు 27, ప్రభాతవార్త:** జవహర్‌నగర్, చంద్రపురి కాలనిల్లోని అర్హులైనా గృహ యజమానులకు ఇళ్ల నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు జారీ చేసే అంశంపై మల్క్‌జ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సమీక్షించారు. గురువారం కిసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ వార్డులో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన ఆయన, గ్రామకంఠం పరిధిలోని ఇళ్లతో పాటు జీఓ 58,59 పట్టాలు కలిగిన గృహల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జవహర్‌నగర్, చద్రపురి కాలనిల్లో జీఓ 58,59 పట్టాలు కలిగినఅర్హులైనా గృహ యజమానులకు నింబధనల ప్రకారం ఇళ్ల నిర్మాణ అనుమతులు కల్పించే అంశంపై అధికారులతో చర్చించారు. అలాగే అర్హత కలిగిన గృహలకు కొత్త ఇంటి నంబర్లు జారి చేసే ప్రక్రియపై కూడా సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అర్హులైన గృహ యజమానులకు నిబంధనల మేరకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబధిత అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ అనుమతులు, ఇంటి నంబర్లకు సంబధిచిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు..

**మొయినాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మండలంలో రైతులు సాగు చేసిన ఆయా పంటలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఆత్మ కార్యక్రమం ద్వారా మొయినాబాద్ మండలంలో వరి పంటలో సమగ్ర పోషక, చీడపీడల యాజమాన్యంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు జగదీశ్వర్ రెడ్డి, పెద్దమంగళారం గ్రామానికి చెందిన రైతు ఎం. కృష్ణారెడ్డి పొలాల్లో వరి పంటను పరిశీలించి, పంట ఎదుగుదల, పోషక లోపాలు మరియు చీడపీడల నివారణపై రైతులకు సరైన వినియోగం, జీవ ఎరువుల వినియోగం, కలుపు మొక్కల సమగ్ర యాజమాన్యం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చని వివరించారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, చీడపీడలు మరియు తెగుళ్లను ముందస్తుగా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి పి. అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు దీనా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ ముఠా అరెస్ట్

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

**మేడ్చల్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండల పరిధిలో రాజబొల్లారం గ్రామంలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు గురువారం అక్రమ ఎల్‌పీజీ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తున్న విజయేందర్ గుప్తా, సన్నీ గుప్తా, మునీష్ గుప్తా, విశాల్ గుప్తాలను అదుపులోకి తీసుకున్నారు. అదే విదంగా వారి వద్ద నుండి 15 కిలోల 200 గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ రీఫిల్లింగ్ కోసం ఉపయోగిస్తున్న 4 మోటార్లు, వెయింగ్ మిషన్, హీట్ మిషన్, అశోక్ లేలాండ్ వాహనం, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బీహార్, యూపీ ప్రాంతానికి చెందిన ఈ నిందితులను మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పూడూరు మండలం కద్మూరు ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను జరుపుకుంటున్న చిన్నారులు

## అనురాగాలకు ప్రతీకగా రక్షాబంధన్

: సర్పంచ్ శివశంకర్,హెచ్ఎం మధు

**పూడూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అనురాగాలకు, ఆప్యాయతలకు ప్రతీకగా రక్షాబంధన్ అని సర్పంచ్ శివశంకర్, ప్రధానోపాధ్యాయుడు మధు పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా గురువారం పూడూరు మండలం పరిధిలోని కద్మూరు ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకలు జరుపుకోవడం వల్ల విద్యార్థుల్లో సాంస్కృతిక, సాంద్రాయాలపట్ల అవగాహన కలుగుతుందన్నారు. సోదరభావం పెంపొందించేందుకు, సమాజంలో అమ్మాయిలపట్ల పెరుగుతున్న వివక్ష, విషసాంస్కృతిని అంత మొందించేందుకు రక్షాబంధన్ లాంటి పండుగలు ఎంతగానో ఉపయోగ పడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జె మహేందర్, ఉపాధ్యాయులు హరీష్‌బాబు, అనూష, నాయకులు పోచయ్య, విద్యార్థుల తలిదండ్రులు అంజలి, రాజు, అనంతయ్య, లింగం, నసీంబేగం, ఇప్పత్‌బేగం ,ప్రమీల, మమత, అంగన్‌బాడీ కార్యకర్తలు వెంకటమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



రక్షా బందన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**జిల్లేడు చౌదరి గూడెం, ఆగస్టు 27, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకొని ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొన్నారు. విద్యార్థులందరూ సోదరభావంతో మెలగాలని ప్రధానోపాధ్యాయులు శోభన్ అన్నారు. తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు ప్రతివిద్యార్థి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎల్కిచర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, ఉపాద్యాయులు రాజు, జ్యోతి, శిరీష క్రాంతిమై పాల్గొన్నారు.

## అక్కా చెల్లెళ్లు,అన్నా తమ్ముళ్ల రక్షణకు రక్షాబంధన్

**కీసర,ఆగస్టు27,ప్రభాతవార్త:** ఆక్క చెల్లెళ్లు, అన్నా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన హిందూ పండుగ రక్షాబంధన్,(రాఖీ పౌర్ణమి) అని నాగారం సెరినిటి పాఠశాల ముఖ్య



నాగారం సెరినిటి పాఠశాలలో ఒకొరికొకరు రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

కార్యదర్శి నోముల వసంత పేర్కొన్నారు. గురువారం నాగారం సెరినిటి పాఠశాల విద్యార్దులు రాఖీపండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి) రోజున ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. విద్యార్దులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నీకు నేను రక్షా, నాకు నీవు రక్షా మనం ఇద్దరం దేశానికి రక్ష అని నినదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ నోముల జంగిరెడ్డి, ఉపాద్యాయులు, విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**తలకొండపల్లి, ఆగస్టు 27 ,ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామానికి చెందిన బోదాస్ యాదగిరికి రెండు లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కును గురువారం నాడు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. బోదాస్ యాదగిరి అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చికిత్స కోసం సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రెండు లక్షల రూపాయలు మంజూరైన ఎలువసి చెక్కును ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్, ప్రదీప్ రెడ్డి శ్రీరామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి

**చేవెళ్ల, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్ కాంప్లెక్స్‌లో సున్నపు హారిక నూతనంగా ఏర్పాటు చేసిన సౌభాగ్య కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ షాప్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షాప్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్‌ను పరిశీలించి, వివిధ రకాల డిజైన్లు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని అన్నారు. నేటి కాలంలో ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్‌కు మంచి డిమాండ్ ఉందని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని నాణ్యమైన పనులు అందిస్తే మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు తమకు ఉన్న నైపుణ్యాలను ఉపాధిగా మలుచుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. కొత్తగా వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్న మహిళలకు కుటుంబ సభ్యులు, సమాజం ప్రోత్సాహం అందించాలన్నారు. సౌభాగ్య కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని షాప్ నిర్వాహకురాలు సున్నపు హారికను అభినందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థ అభివృద్ధి చెందుతూ మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, మంగలి కళ్యాణియాదగిరి, బక్కరెడ్డి మాధవియాదిరెడ్డి, ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ మద్దెల శివనీలచింటూ, నాయకులు శివకుమార్, గజ్జెల యాదయ్య తదితరులు ఉన్నారు.



కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్ షాప్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్